ఎడతెరిపిలేని వర్షం

మూసాపేట సర్కిల్‌లో రోడ్లపై నీటి నిల్వలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ అత్యవసర బృందాలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 31 : రోజంతా ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చినుకులుగా.. తెప్పలు తెప్పలుగా వర్షం కురియగా.. నగరంలో జనజీవనం అవస్థలు పడ్డారు. ఉదయాన్నే పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులతో పాటు ఉద్యోగాల కోసం వెళ్లే వారంతా ఇబ్బందులు పడ్డారు. ఎడతెరిపి లేకుండా కురియడంతో రోడ్లపైకి కార్లు, ఆటోలు భారీగా చేరుకోవడంతో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. కొన్నిచోట్ల మ్యాన్ హోల్స్ తెరుచుకోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆయా లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని జీహెచ్ఎంసీ అత్యవసర బృందాలు రంగంలోకి సహాయక చర్యలు చేపట్టారు. మ్యాన్‌హోళ్లలో మట్టి, చెత్తాచెదారం చేరుకుంటే వాటిని తొలగించి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చేశారు. వర్షంనీటి ప్రవాహానికి అడ్డంకులను గుర్తించి తొలగించే పనులను చేపడుతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం..

అల్లాపూర్: వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ సబీహాబేగం సూచించారు. శనివారం సఫ్దార్‌నగర్,రాజీవ్ గాంధీనగర్ లోతట్టుప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటించారు. నాలాల్లో వరదనీరు వచ్చి చేరడంతో పైపులైన్ల నుంచి మురుగు నీరు వెనక్కి వచ్చి ఇళ్లలోకి నీరు చేరి రోడ్లన్నీ జలమయమయ్యాయి. సహాయక చర్యలు చేపట్టాలని శానిటేషన్ అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు.

సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది

సహాయక చర్యలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబీహాబేగం

ఘన సన్మానం

పదవీ విరమణ పొందిన సిబ్బందిని సన్మానిస్తున్న కమాండెంట్ సన్నీ

కొండాపూర్, ఆగస్టు 31 : కొండాపూర్‌లోని 8వ పోలీసు బెటాలియన్‌లో సేవలందించి పదవీ విరమణ పొందిన పలువురు సిబ్బందిని శనివారం బెటాలియన్ కమాండెంట్ సీ సన్నీ ఘనంగా సత్కరించారు. బెటాలియన్‌కు చెందిన ఏఆర్ఎస్ఐలు మున్నీర్ ఖాన్, సద్గురువయ్య, హెడ్ కానిస్టేబుల్ జీ అరవిందరెడ్డి, కుక్ సయ్యద్ ఖాసీమ్‌లు పదవీ విరమణ పొందిన తరుణంలో వారిని కుటుంబ సమేతంగా అధికారుల సమక్షంలో సత్కరించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ.. పదవీ విరమణ అనంతరం కుటుంబంతో కలిసి సంతోషంగా గడపాలన్నారు. భవిష్యత్తులో సహాయ, సహకారాలు అందించేందుకు బెటాలియన్ సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి భూమిపూజ

జగద్గిరిగుట్ట, ఆగస్టు31: సామూహిక కార్యక్రమలతో అందరికీ సంక్షేమం, శాంతి నెలకొనాలని ఆధ్యాత్మిక వేత్తలు ఆకాంక్షించారు. రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీ హౌసింగ్‌బోర్డు కాలనీలోని అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప ఆలయ నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. ప్రముఖ ఆయ్యప్ప ఉపాసకుడు అరుణ్‌గురుస్వామి అతిథిగా హాజరై కలశస్థాపన చేయించారు. భక్తుల సహకారంతో రూ.25 లక్షలతో ఆలయ పనులు ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు. నాగిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, శ్రీరాంరెడ్డి, రాంచందర్ కాలనీ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్ష జవాబు పత్రాల నకలుకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 31: ఓయూ పరిధిలోని అన్ని ఫ్యాకల్టీల పరిధిలోని అన్ని విభాగాల ప్రీ పీహెచ్‌డీ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీ పీహెచ్‌డీ కోర్స్ వర్క్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్ , ఆగస్టు 31 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. వాతావరణ శాఖ సూచన మేరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. డ్రైనేజీలు, విద్యుత్ , తాగునీటి పరంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా అధికారులకు దృష్టికి గాని తమ కార్యాలయాన్ని గాని సంప్రదించాలని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ఎమర్జెన్సీ బృందాలు, సహా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని వరద నివారణ చర్యలను చేపట్టాలన్నారు. నాలాలు, డ్రైన్ల వద్ద వరద నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు కాలనీలు ముంపునకు గురి కాకుండా ముందస్తు జాగ్రత్తలను చేపట్టి ప్రజలను అప్రమత్తం చేయాలని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉన్నందున ఎటువంటి అనారోగ్యాలు, అంటు వ్యాధులు దరి చేరకుండా సిబ్బంది అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే అన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

సంక్షేమ సంఘాల నేతల సమస్యలు తెలుసుకుంటున్న కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ

దుండిగల్,ఆగష్టు 31:ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, కాలనీ వాసులు,సంక్షేమ సంఘాల ప్రతినిధులతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు శనివారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తమ,తమ ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన శంభీపూర్‌కృష్ణ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లో తరచూ డ్రైనేజీ ఓవర్ ఫ్లోతో దుర్వాసన, దోమల వృద్ధితో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని సమస్యలకు గల కారణాలు తెలుసుకొని శాశ్వతంగా సమస్యకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులతో శంభీపూర్ కృష్ణ ఫోన్‌లో మాట్లాడి తెలిపారు. ప్రతి సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని సూచించారు.

డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 31: ఓయూ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్, మేకప్ పరీక్ష ఫీజును ఈనెల 12వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 19వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, ఆగస్టు 31 : వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురి నృత్యకారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విశాఖపట్నం నుంచి విచ్చేసిన చందన డాన్స్ అకాడమీ గురువు కూచిపూడి నాగ చందన తన శిష్య బృందంతో కలిసి ప్రదర్శించిన నృత్యాలు ఆద్యాంతం ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో శుక్లాం భరధరం, మూషిక వాహన, భావములోన, తాండవ నృత్యకారి, మహాలక్ష్మి అష్టకం, తారంగం, నృత్యతి, చిన్న శిశువు, శివ పంచాక్షర స్తోత్రం, భజమానస, మంగళం అంశాలను శ్రీనిధి, సంహిత, వేధశ్రీ, కుషిత, శాన్వి కృష్ణ, సహస్ర, రమ్య, శ్రీవాసు, పర్ణిక, నయన, లాస్య, పల్లవిలు కూచిపూడి నృత్య రూపకంలో ప్రదర్శించారు.

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

బెంచ్ ప్రెస్ పోటీలు నిర్వహించడం అభినందనీయం

బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్, ఆగస్టు 31: బాలానగర్‌లో మొదటిసారి రాష్ట్ర వ్యాప్త బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం బాలానగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామం చేయడంతో దేహ దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవెంట్ ఆర్గనైజర్ పవర్ లిఫ్టర్ రమేశ్ బాబు, జై హనుమాన్ వ్యాయామశాల బాలానగర్ సభ్యులు కేఎస్ఎన్‌రెడ్డి, ఎండీ ఖాజా, రవీందర్, ఎన్‌వీ.రత్నం, నర్రా దేవేందర్‌రెడ్డి, రంగంపేట్ శ్రీనివాస్, మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

హెచ్ఏఎల్ ఎన్నికల్లో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ కూటమి గెలుపు

బాలానగర్, ఆగస్టు 31 : బాలానగర్‌లోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ కూటమి గెలుపొందింది. హెచ్ఏఎల్‌లో మొత్తం 890 ఓట్లు కాగా హిందుస్థాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ కూటమికి 441 ఓట్లు పోలు కాగా హెచ్ఏఎల్ కార్మిక సంఘ్ (బీఎంఎస్)కు 424 ఓట్లు పోలయ్యాయి. 11 ఓట్లు చెల్లలేదు. 14 మంది పోలింగ్‌కు హాజరు కాలేదు. కాగా 17 ఓట్ల తేడాతో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ కూటమి గెలుపొందినట్లు ఎలక్షన్ అధికారులు వెల్లడించారు. ఈ గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ కూటమిని గెలిపించినందుకు యూనియన్ నేతలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కృషి చేస్తామని తెలిపారు. అధ్యక్షుడు వెంకటాద్రి, గౌరవ అధ్యక్షుడు విజయప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కర్కనాగరాజ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌బాబు, గణేశ్, సిబ్గతుల్లా, ప్రవీణ్, చందర్రావు నాయక్, సురేశ్, రాంచందర్, వెంకటపతి, అన్వర్, చిలుకరాందాస్ పాల్గొన్నారు.

సంబురాల్లో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ కూటమి నేతలు

దరఖాస్తుల ఆహ్వానం

దుండిగల్,ఆగస్టు31: కుత్బుల్లాపూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోఅతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.అలివేలు మంగమ్మ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఆంగ్లం, తెలుగు, కామర్స్, ఫిజిక్స్ సబ్జెక్ట్‌లలో బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 3వతేదీ మధ్యాహ్నం 2 గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కేపీహెచ్‌బీ కాలనీ: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఆంగ్లం, తెలుగు, గణితం, హిస్టరీ, కామర్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్ట్‌లను బోధించడానికి ఆసక్తి గలవారు సెప్టెంబర్ 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని అదే రోజున ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయా సబ్జెక్ట్‌లలో పీజీలో 55శాతం (ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం)తో ఉత్తీర్ణత సాధించి ఉండాలని, నెట్/సెట్/పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. రేపటి నుంచి కూకట్‌పల్లి డిగ్రీ కళాశాలలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతందని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఘనంగా దుర్గభవానీ వార్షికోత్సవం

బాలానగర్, ఆగస్టు 31 : ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధి భవానీనగర్‌లోని దుర్గభవానీ అమ్మవారి 13 వ వార్షికోత్సవాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ వేడుకల సందర్భంగా భవానీనగర్ అంతటా ఆధ్యాత్మిశోభ సంతరించుకుంది. ఈ వేడుకల సందర్భంగా బస్తీవాసులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వేడుకలకు కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆకట్టుకున్న నృత్యాలు

మాదాపూర్, ఆగస్టు 31: కళాకారులు నృత్య ప్రదర్శనలతో భక్తులను ఆద్యంతం ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని అన్నమాచార్య భావన వాహినిలో శనివారం పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో అన్నమాచార్య భావన వాహిని విద్యార్థులతో నృత్య కార్యక్రమాలను నిర్వహించారు. మొదటగా కీర్తన స్వరూప్‌లు ఆనంద నార్తన గణపతి పై రంజనీ నిరంజని నారాయణీయం, పలుకుటీనియ తల్లి వంటి సంకీర్తనలను ఆలపించారు.

హైరిస్క్ ప్రెగ్నెన్సీలపై అవగాహన

హాస్పిటల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ లావణ్య ఎన్‌జేపీ

కొండాపూర్, ఆగస్టు 31 : ఆలస్య గర్భం, హై–రిస్క్ ప్రెగ్నెన్సీలపై శనివారం మాదాపూర్‌లోని మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, సైబర్ క్రైమ్స్ సీఐడీ డాక్టర్ లావణ్య ఎన్‌జేపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యావేత్త ఆంచల్ బన్సల్, టీఏఓ డిజిటల్ సొల్యూషన్స్ హెచ్ఆర్ లావణ్య అల్లూరిలతో కలిసి గర్భిణులకు మాతృదేవోభవ ప్రత్యేక డెలివరీ ప్యాకేజీ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ లావణ్య మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వాలంటే తల్లులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ, సరైన ఆరోగ్య నియమాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌వీ లక్ష్మి, డాక్టర్ రవీందర్‌రెడ్డి, సవిత, మీనాక్షి, కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ సుంకరి క్రిష్ణవేణి

దుండిగల్,ఆగస్టు31: మహిళలు స్వశక్తితో ఎదిగినప్పుడే ఆయా కుటుంబాలతో పాటు దేశాభివృద్ధి సాధ్యమవుతుందని దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుంకరి క్రిష్ణవేణి కృష్ణ అన్నారు. శనివారం గండిమైసమ్మలోని దుండిగల్ పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన' ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్'ను మున్సిపల్ చైర్‌పర్సన్ సుంకరి క్రిష్ణవేణి కృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తూ, ఉన్నతమైన లక్ష్యం వైపు దృష్టి సారించాలన్నారు. మహిళలు స్వయం కృషితో తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థికంగా ఎదుగుతూ ఇతరులకు ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

కొండాపూర్, ఆగస్టు 31 : కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, దీని కోసమే రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ఆలోచనలతో పథకాలను ప్రవేశపెడుతుందని మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఆమె మాదాపూర్‌లోని శిల్పారామం నైట్ బజార్ షాపింగ్ కాంప్లెక్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి సరికొత్త ఆలోచనలతో పథకాలను తీసుకువస్తున్నారన్నారు. 64 లక్షల మంది మహిళలు సొంత కాళ్లపై నిలబడేలా 17 రకాల వ్యాపారాలను మా సెర్ఫ్ ద్వారా చేపట్టడం జరుగుతుందన్నారు. వివిధ రకాల వ్యాపారాల్లో మహిళలు రాణిస్తున్నారని, నైట్ బజార్‌లో ఉన్న 106 స్టాల్స్‌ను అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేసుకునేందుకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. నైట్ బజార్ 8 సంవత్సరాలుగా మూతబడిందని, మరమ్మతుల కోసం ముఖ్యమంత్రి రూ. 7 కోట్లు కేటాయించారని, డిసెంబర్ 9న తిరిగి ప్రారంభిస్తామన్నారు. శిల్పారామంకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

నైట్ బజార్‌ను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

పెండింగ్ పనులను పూర్తి చేయిస్తా



కార్పొరేటర్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మియాపూర్ , ఆగస్టు 31 : కాలనీల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. తొలుత కాలనీలలో పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేయించి నూతన వాటిని ఆరంభిస్తామన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరీనగర్ కాలనీలో సమస్యల పరిష్కారం, నూతన పనులపై కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం కార్పొరేటర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ మయూరీనగర్‌లో అసంపూర్తిగా ఉన్నరహదారులు, నీటి వసతి , యూజీడీ లైన్ల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీఇచ్చారు. డివిజన్ అవసరాలను, అదనపు నిధుల అంశాలను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకెళుతున్నట్లు పేర్కొన్నారు.దశలవారీగా సమస్యలన్నింటినీ పూర్తి చేయించి కాలనీకి ఎల్లపుడూ అండగా నిలుస్తానని శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు రామరాజు, సోమేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, వెంకట్‌రావు, మురళీ కృష్ణ, చిరంజీవి, లలిత్‌బాబు, అనూష,బాలకృష్ణ, కోటేశ్వర్‌రావు, శరత్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

దుండిగల్,ఆగస్టు31: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు చేపట్టిన కూల్చివేతలు వివాదాస్పదంగా మారాయి. కేవలం పేదప్రజలవి కాబట్టే అధికారులు కూల్చివేతలు చేపట్టారని సీపీఐ నేతలు ఆరోపిస్తుండగా,మున్సిపాలిటీ నుంచి ఎటువంటి అనుమతులు లేకపోవడంతోనే నిర్మాణాలను కూల్చివేశామని అధికారులు పేర్కొంటున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్,33వ డివిజన్ పరిధిలోని సైదప్పబస్తీ,ఇంద్రన్న కాలనీలో అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నట్లు మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు అందాయి.ఈ నేపథ్యంలో టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారి ప్రశాంతి ఆదేశాల ప్రకారం పలువురు సిబ్బంది సైదప్పబస్తీ,ఇంద్రన్న కాలనీలో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాల్లో కూల్చివేతలు చేపట్టారు. అది కూడా తూతూ మంత్రంగా కూల్చివేశారు.

సమస్యలు పరిష్కరిస్తా

దుండిగల్,ఆగస్టు31: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ,మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజును శనివారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తమ,తమ బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను వివరించడంతో పాటు వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్సీని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానన్నారు.